

జగన్ ఐదేళ్ల పాలనలో సహజ వనరుల విధ్వంసం ఇష్టారాజ్యంగా జరిగింది. ఇసుక, గ్రావెల్ మట్టిని అడ్డగోలుగా తవ్వుకుని లక్షలాది రూపాయలు వెనకేసుకున్నారు. వారిని అడ్డుకునే ప్రయత్నం అప్పటి అధికారులు చేయలేదు. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెల దాటింది. ఈ సారి 4.0 పాలన చూస్తారని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అయినా ఇంకా పాత ప్రభుత్వంలో లాగానే సాగుతోంది. వైసీపీ తరహాలోనే.. టీడీపీ నేతలు సైతం కొండలను గుల్ల చేసేస్తున్నారు.

- జగన్ హయాంలో కొండలను గుల్ల చేశారు
- ఇప్పుడూ అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు
- జాతీయ రహదారి పనులకు విక్రయం
- లక్షలాది రూపాయలు గడిస్తున్న టీడీపీ నేత

అదే.. దందా..!

(కడప-ఆంధ్రజ్యోతి): ఎవ్వరు అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు ప్రకటించారు. అయినా ఇంకా కొందరు నేతల్లో మార్పు రాలేదు. బ్రహ్మంగారిమఠానికి చెందిన ఓ టీడీపీ నేత అనుమతులు లేకుండానే కొండను గుల్ల చేసి గ్రావెల్‌ను తవ్వేసి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అనుమతి లేని గ్రావెల్ తవ్వకాలపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. అయినా ఇంకా గ్రావెల్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగుతుండడం గమనార్హం. అనంతపురం జిల్లాలోని తాడికొండ చెక్‌పోస్టు నుంచి విజయవాడ వరకు ఆరు వరుసల జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల మీదుగా వెళ్లనుంది. ఈ పనులను మేఘా కన్‌స్ట్రక్షన్ దక్కించుకుంది. రహదారి పనుల నిర్మాణానికి అవసరమైన గ్రావెల్, మట్టిని అనుమతులు తీసుకుని తవ్వాల్సి ఉంది. కేటాయించిన ప్రాంతంలోనే కేటాయించిన మేర తవ్వుకోవాలి. పర్యావరణ, ఇతర ఇబ్బందులు లేవని నిర్ధారిస్తే అనుమతులు ఇస్తారు. గ్రావెల్ తవ్వకాల్లో ప్రభుత్వానికి క్యూబిక్ మీటరుకు రూ.105.30 చెల్లించాల్సి ఉంది.

తవ్వేసెయ్.. అమ్మేసెయ్

రహదారుల నిర్మాణం, లేఅవుట్ల లెవలింగ్‌కు గ్రావెల్ అవసరం ఉంటుంది. అయితే బ్రహ్మంగారిమఠానికి చెందిన ఓ టీడీపీ నేత ఈ జాతీయ రహదారి పనులను బంగారు బాతుగా ఉపయోగించుకుంటున్నారు. ఆ మండలంలోని పలుగురాళ్లపల్లె గ్రామం తిప్పగటన కొండను ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వేసి టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు చెబుతున్నారు. ఒక్కో టిప్పరును రూ.5 వేలకు విక్రయిస్తున్నారని అంటున్నారు. నాలుగు రోజులుగా నిర్విరామంగా గ్రావెల్ తవ్వుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. అధికార పార్టీ నేత కావడంతో అధికారులు భయపడుతున్నారనే విమర్శ ఉంది. ఈ కాంట్రాక్టర్లు కూడా అధికార పార్టీ నేత ద్వారా అవసరమైన గ్రావెల్‌ను అడ్డంగా తవ్వుతున్నట్లు చెబుతున్నారు. రోజూ పెద్ద ఎత్తున తరలిస్తున్నారని సమాచారం.



ఆదిలోనే అడ్డుకట్ట వేయకపోతే..

తొలి నెలరోజుల్లో చంద్రబాబు ప్రభుత్వం ఫీల్‌గుడ్ తెచ్చుకుంది. పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు ఇతర వాటితో అటు గ్రామీణ ప్రాంతాల్లో ఇటు పట్టణాల్లో మంచి పేరు తెచ్చుకుంది. ఈ సారి 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు పడడంతో ఎన్నాకెన్నాళ్లకు భాగ్యమని ఆ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఇలా అన్ని వర్గాలు నెలరోజుల పాలనపై సంతోషంగా ఉన్నాయి. గాడితప్పిన వ్యవస్థను చంద్రబాబు గాడిలో పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలు ఉండకూడదని చంద్రబాబు నాయుడు గట్టిగా ఉన్నారు. అయితే కొందరు నేతల కారణంగా పార్టీకి చెడ్డపేరు వస్తుందనే ఆందోళన టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి ఇలాంటి పనుల కారణంగానే చెడ్డపేరు వచ్చింది. ఇలాంటి నేతలపై ఆదిలోనే అడ్డుకట్ట వేయకపోతే చంద్రబాబుకు చెడ్డపేరు వస్తుందని టీడీపీ నేతలు అంటున్నారు.

ఆర్జేడీ రాఘవరెడ్డిపై 18, 19 తేదీల్లో విచారణ

- హాజరు కానున్న విచారణాధికారి డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్
- ఉత్తర్వులు విడుదల


రాఘవరెడ్డి (ఫైల్)

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: కడప డీఈవో కార్యాలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో పూర్వ పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు (ఆర్జేడీ) ఎద్దుల రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరగనుంది. విచారణ అధికారి ఏపీ పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ఎం.ప్రసన్నకుమార్ హాజరు కానున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ఉపాధ్యాయ వృత్తి నుంచి ఎదిగిన రాఘవరెడ్డి కడప డీఈవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో తోటి ఉపాధ్యాయులతో అసభ్యకరంగా బూతులతో, ఏకవచన సంబోధనలతో మాట్లాడతారనే ఆరోపణలు ప్రధానమైనవి. అలాగే మహిళా ఉపాధ్యాయుల వస్త్రధారణపై కూడా వ్యంగ్యంగా మాట్లాడతారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీలు, పదోన్నతుల్లో వైసీపీ నేతలకు అనుగుణంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా డీఈవో చాంబరులో వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘ నేతలకు ప్రధాన స్థానం కల్పించి వారు చెప్పిన వారికే అనుకూలంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజూ డీఈవో కార్యాలయంలో సాయంత్రం 5 గంటల తరువాత వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘాల నేతలతో కూర్చుని సుదీర్ఘంగా చర్చించేవారని సమాచారం. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం రాఘవరెడ్డి నైజమని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపునకు పరోక్షంగా ప్రత్యక్షంగా పనిచేశారనే అపవాదు ఉంది. రాఘవరెడ్డి చేసిన అవినీతి అక్రమాలపై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అప్పట్లో కలెక్టరు, గవర్నరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఎందుకంటే అప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆర్జేడీ రాఘవరెడ్డిపై ఆధారాలతో సహా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ పరిశీలించి విచారణకు ఆదేశించారు. దీంతో ఈ నెల 18, 19 తేదీల్లో కడప డీఈవో కార్యాలయంలో విచారణ జరగనుంది.

ఆరోపణలు వచ్చినా.. ఆర్జేడీగా పదోన్నతి

ఆర్జేడీ రాఘవరెడ్డిపై విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పలుమార్లు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కలెక్టరు స్పందించి డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌తో విచారణ కమిటీ వేశారు. డీఈవోగా ఉన్న రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి విద్యార్థి సంఘాలు ఉపాధ్యాయ సంఘాలు ఆధారాలతో సహా విచారణ కమిటీకి అందించారు. వైసీపీ ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకోకపోగా ఆర్జేడీగా పదోన్నతి కల్పించారు.

న్యాయం కోసం ఎదురుచూపులు

రాఘవరెడ్డి ద్వారా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉపాధ్యాయులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం దక్కలేదు. కొత్త ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశతో ఉన్నారు. ఎవరైతే ఆయన చర్యలవల్ల ఇబ్బందులు పడ్డారో వారు, అలాగే విద్యార్థి సంఘాలు విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 12: జిల్లాలో చారిత్రాత్మక సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి 23వ తేది వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. 13న రాత్రి అంకురార్పణ, 14న ధ్వజారోహణం, యాలి వాహనం, 15న హంసవాహనం, 16న సింహవాహనం, 17న హనుమంత వాహనం, 18న శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 19న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 20న కల్యాణోత్సవం, 21న రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం, 23న పుష్పయాగం, ఏకాంతసేవ కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

పోష్ చట్టంతో వేధింపులకు చెక్ : డీఆర్వో


పోష్ చట్టం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), జూలై 12: జిల్లాలో పోష్ చట్టం పటిష్టంగా అమలు చేస్తే మహిళలపై లైంగిక వేధింపులకు చెక్ పడుతుందని, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్మెంట్ అట్ వర్క్ ప్లేస్ (పోష్ యాక్ట్-2013)పై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశాల్లో వారికి లైంగిక వేధింపుల నుంచి ఈ చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో లోకల్ కంప్లైంట్స్ కమిటీని (ఎల్‌సీసీ)ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా స్పెషల్ కలెక్టర్ కౌసర్ బాను, కన్వీనర్‌గా ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. వీరితో పాటు ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ప్రతి మహిళకు ఈ చట్టం వర్తిస్తుందన్నారు. పదిమందికి పైగా ఉద్యోగులు పనిచేసే ప్రతి ప్రభుత్వ సంస్థలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఎల్‌సీసీ)ని తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు జరిగే సమావేశంలో ఫిర్యాదులు ఉంటే పరిష్కరించాలన్నారు. ఈ కమిటీ కాలపరిమితి మూడేళ్లు ఉంటుందన్నారు. పదిమంది కంటే తక్కువ పనిచేసే సంస్థల్లో మహిళలు వేధింపులకు గురైతే మున్సిపల్ కమిషనర్‌కు, మండల స్థాయిలో తహశీల్దారుకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులు స్వీకరించిన వారంలోగా సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీ చేసి 90 రోజుల్లో విచారణ చేసి లోకల్ కంప్లైంట్ కమిటీకి నివేదికలు పంపాలన్నారు. బాధిత మహిళల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఫిర్యాదు రుజువైతే క్రిమినల్ మరియు సివిల్ శిక్షలు అమలవుతాయన్నారు. అనంతరం కమిటీ చైర్‌పర్సన్ కౌసర్ బాను మాట్లాడుతూ పోష్ చట్టం -2013 పై గ్రామ, మండల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వేధింపులకు గురైన మహిళలకు ఈ చట్టం ద్వారా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీపీ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పోష్ చట్టంపై ఏవైనా సందేహాలుంటే తమ సంస్థలోని న్యాయవాదులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో దిశ డీఎస్పీ రమాకాంత్, ఆర్డీవోలు వెంకటపతి, శ్రీనివాసులు, డీఈఓ అనురాధ, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఆకట్టుకునేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త స్కీమ్‌లు సృష్టిస్తున్నారు. షేర్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వచ్చి సంపన్నులు అవుతారంటూ చెప్పే సైబర్ నేరగాళ్ల మాటలు విని పలువురు మోసపోతున్నారు. రకరకాల ఆన్‌లైన్ యాప్‌లతో ఏమార్చి జనం డబ్బు దోచేస్తున్నారు. వీరి బారిన పడి డబ్బు పోగొట్టుకున్న వారు జిల్లాలో 19 నెలల వ్యవధిలో 3743 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.



షేర్ ట్రేడింగ్ పేర్లతో మోసాలు

- షేర్లలో భారీగా లాభాలు అంటూ..
- ఆశ చూపిస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఆన్‌లైన్‌లో జాగ్రత్త లేకపోతే సొమ్ము ఖాళీనే
- నకిలీ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా వ్యాప్తంగా 19 నెలల్లో 3743 ఫిర్యాదులు

కడప (క్రైం), జూలై 12: ప్రస్తుతం సాంకేతికతను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుంటున్నారు. చదువుకున్న వారే కాక పెద్దగా చదువు లేని వారు సైతం ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ట్రేడింగ్ యాప్‌లు, షేర్ మార్కెట్ లాంటి వెబ్‌సైట్లలోకి వెళ్లి పరిశీలిస్తున్నారు. అవగాహన లేకపోయినప్పటికీ ఈ యాప్‌ల ద్వారా డబ్బులు వస్తాయని ఆశతో కొందరు.. అత్యాశతో మరికొందరు షేర్ ట్రేడింగ్ మార్కెట్లో లక్షల్లో డబ్బులు పెట్టి పోగొట్టుకుంటున్నారు.

ఈ సైబర్ నేరగాళ్లు ముందుగా వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ర్యాండమ్‌గా అందరికీ స్టాకు మార్కెట్లో షేర్స్ ట్రేడింగ్ ద్వారా అధిక లాభాలు తెప్పిస్తామని మెసేజెస్ పెడుతుంటారు. ఎవరైనా ఆ సందేశాలకు స్పందించి రిప్లై ఇస్తే చాలు. వారికి అధిక లాభాల ఆశ చూపుతారు. షేర్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని ప్రలోభ పెట్టి మంచి రాబడి ఇస్తామని హామీ ఇస్తారు. ఇటీవల కడప నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశతో దాదాపు లక్షల్లో సొమ్ము పోగొట్టుకుని కడప, గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కడప టూటౌన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు షేర్ మార్కెట్లో అప్పులపాలై నిండు కుటుంబాన్ని బలిగొన్న సంఘటన కూడా ఇటీవలే జరిగింది.

ఒరిజినల్ పోలిన నకిలీ యాప్‌లను సృష్టించి ఈ సైబర్ నేరగాళ్లు అమాయకులకు వల వేసి అందినకాడికి దోచుకోవడంతో పాటు తరువాత బోర్డు తిప్పేస్తున్నారు. ఈ సైబర్ నేరాలు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు చేస్తుండడంతో వారిని పోలీసులు పట్టుకోలేకపోతున్నారు. అడ్రస్ ఒక చోట అయితే వీరు మోసాలు చేసేది మరో చోట కావడంతో పోలీసులకు సవాల్‌గా మారుతోంది. కొంత మంది తెలిసి కూడా డబ్బులు వస్తాయని ఆశతో షేర్ ట్రేడింగ్‌లలో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. 19 నెలల్లో షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్నామంటూ 3,743 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారంటే ఏ స్థాయిలో బాధితులు ఉన్నారనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు చెప్పినప్పటికీ కొంత మంది వీటిలో పెట్టుబడి పెట్టి వారి వద్ద ఉన్న సొమ్మును పోగొట్టుకుంటున్నారు. ఆన్‌లైన్ ఫైనాన్స్ సెల్ ఫ్రాడ్‌లోని ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం, బిజినెస్ ఈమెయిల్, డెబిట్ కెపాసిటీ, ఫేక్ కాల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ రిలేటెడ్, యుపీఏ రిలేటెడ్ లాంటి నకిలీ యాప్‌లతో వలవేసి అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రజలు వీటితో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు ఖాతాల వివరాలు, ఆన్‌లైన్ పేమెంట్ ట్రాన్స్‌ఫర్‌పై జాగ్రత్తలు తీసుకోవాలి. కొత్త వ్యక్తుల మాటలు విని వ్యక్తిగత సమాచారంతో పాటు బ్యాంకు ఖాతాల వివరాలు ఎవరికీ చెప్పకూడదు. ఎవరైనా సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తే తక్షణమే సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

- శ్రీధర్‌నాయుడు, సైబర్ సెల్ సీఐ

స్టీల్ ప్లాంట్ నిర్మిస్తాం

- జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా
- వైసీపీ దౌర్జన్య పాలనకు ప్రజల తీర్పు అద్భుతం
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్
- అడుగడుగునా పూల వర్షం, గజమాలలతో అపూర్వ స్వాగతం
- దేవుని కడప, పెద్దదర్గాలో కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు



కడప (మారుతీనగర్), జూలై 12: కేంద్ర ప్రభుత్వ సాయంతో కడపలో స్టీలుప్లాంటు నిర్మాణం చేపట్టి తీరుతామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ స్పష్టం చేశారు. యర్రగుంట్ల మండలం పోట్లదుర్తికి చెందిన ఈయన ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా బీజేపీ తరఫున ఎన్డీయే కూటమి అభ్యర్థిగా మూడు లక్షల పైచి లుకు ఓట్ల మెజారిటీతో జయకేతనం ఎగురవేసి మొట్టమొదటి సారిగా జిల్లాకు వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన కడప విమానాశ్రయం చేరుకోగానే బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పెద్దసంఖ్యలో ఘన స్వాగతం పలికారు. కడప విమానాశ్రయం నుంచి నేరుగా దేవునికడపకు భారీ ర్యాలీగా వెళ్లారు. ఇందులో సుమారు 200 స్కూటర్లు, వంద కార్లతో పాల్గొన్నారు. బాణసంచా మోత, డప్పువాయిద్యాల హోరుతో, గజమాలలతో అపూర్వ రీతిలో పార్టీ నాయకులు అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఆ మేరకు తిరుమల తొలిగడప దేవునికడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం పెద్దదర్గాను చేరుకుని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మజార్ల వద్ద పూలచాదర్ సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీగా విజయం సాధించి కడపకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సొంత జిల్లా ప్రజలతో పాటు అనకాపల్లి ప్రజల రుణం తీర్చుకునేందుకు ప్రజాసేవలో ముందుంటానన్నారు.

వైసీపీది ఐదేళ్లూ దోపిడీ పాలన

వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇసుక, మట్టి, రాళ్లు, వాగులు, వంకలు గుట్టలు కొండలు సైతం వదలిపెట్టకుండా దోచుకోవడమే పనిగాపెట్టుకున్నారని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. కేవలం డబ్బుసంపాదనే ధ్యేయంగా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఐదు సంవత్సరాలపాటు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల ఆస్తులను సైతం దోచుకుతిన్నారని నిప్పులు చెరిగారు. దీంతో నిశ్శబ్ద విప్లవంగా గత ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపునకు బాటలు వేశారన్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీల పేరుతో పేదలకు సెంటు స్థలం మంజూరు చేయించి అందులో సైతం ఆ స్థలాలను వైసీపీ నాయకుల హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. అసలు వైసీపీ నాయకులకు పేదలకు ఇళ్లు కట్టాలనే ధ్యాసే లేదని అన్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలనే ధ్యాసతో ముందుకు సాగుతోందన్నారు. గతంలో కడప స్టీలు ప్లాంటు కోసం తాను దీక్ష చేశానని, కేంద్ర ప్రభుత్వం అండతో కడప స్టీలు ప్లాంటు నిర్మాణం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వపథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనరు సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కందుల మురళీమోహనరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, నాయకులు వీవీ చలపతి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి, నాయకులు వీఎస్ అమీర్‌బాబుతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఎంపీ రోడ్డుమార్గాన బయలుదేరి ప్రొద్దుటూరుకు వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో కలసి రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం భారీ వాహన ర్యాలీలో పొంతూరు పోట్లదుర్తికి చేరుకున్నారు. ఎంపీ సీఎం రమేశ్‌ను ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తదితరులు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రమేశ్‌ను అభినందించిన సింగారెడ్డి

జిల్లా పర్యటన నిమిత్తం కడప విమానాశ్రయానికి చేరుకున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి కలిసి ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు. రాష్ట్ర ప్రగతి కోసం కేంద్ర ప్రభుత్వ అండదండలతో ప్రజలకు మంచి చేయాలని కోరారు. ముఖ్యంగా కడప స్టీలు ప్లాంటు నిర్మాణం చేసి జిల్లా నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని విన్నవించారు.


దేవుని కడప వేంకటేశ్వరుని ఆలయంలో ఎంపీ సీఎం రమేశ్ దంపతులు


పెద్దదర్గాలో..


సీఎం రమేశ్‌ను సత్కరిస్తున్న సింగారెడ్డి శ్రీరామ చంద్రారెడ్డి


సీఎం రమేశ్‌తో పాటు ర్యాలీలో పాల్గొన్న హరిప్రసాద్

ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

ఖాజీపేట, జూలై 12: సీజనల్ వ్యాధులపట్ల సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని నిర్లక్ష్యం వహించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ నాగరాజు సూచించారు. శుక్రవారం ఖాజీపేట, మిడుతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన ఆయన వైద్యం అందుతుందన్న విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో లార్వా, ఫీవర్ సర్వే, ట్యాంకు క్లోరినేషన్ తప్పక చేయాలని, వర్షాలు వస్తుండడంతో నీటి నిల్వలు ఉండి దోమలు ఉధృతి అధికం కావడంతో జ్వరాలు వస్తున్నాయన్నారు. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ముబీన్, జిల్లా ఎపిడియాలజిస్టు ఖాజామొహిద్దీన్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, పెంచల్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా ఫెన్సింగ్ తొలగింపు

సీకేదిన్నె, జూలై 12: తాము వేసిన ఫెన్సింగ్‌ను గంట్ల దస్తగిరిరాజు దాదాపు 50 మంది అనుచరులతో దౌర్జన్యంగా తొలగించినట్లు గునకుంట్ల దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరులో తమ స్థలానికి గతంలో ఫెన్సింగ్ వేశామన్నారు. అయితే తాము ఇంటి వద్ద లేని సమయంలో ఫెన్సింగ్‌ను తొలగించి పునాది తీసి రాళ్లు తోలినట్లు దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ స్థలం ఇద్దరి మధ్య కోర్టులో ఉన్నా దస్తగిరిరాజు దౌర్జన్యంగా తొలగించారని తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై చింతకొమ్మదిన్నె ఎస్ఐ శ్రీనివాసరెడ్డిని కోరగా ఇది రెవెన్యూ డిపార్టుమెంట్‌వారు తేల్చాలని రెవెన్యూ డిపార్టుమెంట్‌కు పంపించి వారి హద్దులు నిర్ణయించాలని కోరినట్లు తెలిపారు. అంతవరకు ఇద్దరూ ఎటువంటి పనులు చేయవద్దని పైగా కోర్టులో ఉన్నదానిపై ఎవరూ తొందరపడరాదని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన వైవీయూ పీజీ పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న రిజిస్ట్రారు

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: వైవీయూ అనుబంధ కళాశాలల్లో జరుగుతున్న పీజీ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. యూనివర్శిటీల్లో 29 శాఖల విద్యార్థులు 2, 4 సెమిస్టర్ల పరీక్షలు రాశారు. శుక్రవారం వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను రిజిస్ట్రారు, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసెరు ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రకటించారు.

దుబాయ్ చెట్లు తొలగింపు



ప్రభుత్వ ఆస్పత్రిలో చెట్లను తొలగిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూలై 12: జమ్మలమడుగులో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, రోడ్లపై తదితర ప్రాంతాల్లో ఉన్న దుబాయ్ చెట్లను తొలగిస్తున్నారు. ఆ చెట్ల వలన దోమలు, ఈగెలు తదితర పురుగులతో ప్రజలకు అనారోగ్యానికి గురిచేస్తున్నాయని ఇటీవల తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల ఆవరణాల్లో దుబాయ్ చెట్లను తొలగిస్తున్నారు. జమ్మలమడుగులోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ, మోరగుడి తాడిపత్రి రోడ్డులో విద్యుత్తు కార్యాలయం సమీపాన ఇలాంటి చెట్లను తొలగించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చెట్లు తొలగించిన తర్వాత వెలుతురు మెండుగా వచ్చి దోమలు తగ్గాయని రోగులు, ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

చౌకదుకాణం బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

రైల్వేకోడూరు, జూలై 12: రాఘవరాజపురంలో చౌక దుకాణం బియ్యంను శుక్రవారం రెవెన్యూ ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో నిరంజన్ దాడి చేసి పట్టుకున్నారు. వారు మాట్లాడుతూ చౌక దుకాణానికి చెందిన 27 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు వారు వివరించారు. పట్టుకున్న బియ్యం ఎవరికి తరలిస్తున్నారనేది తెలియరాలేదని తెలిపారు. బియ్యంను ప్రభుత్వ గోదాముకు తరలించామన్నారు.

అక్రమ రేషన్‌బియ్యం పట్టివేత

గాలివీడు, జూలై 12: ఒక రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వవుంచిన రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సివిల్ సప్లయ్ డీసీఎస్‌ఓ రఘురాం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు వివరాల్లోకెళ్తే.. మండల కేంద్రంలో కొద్ది రోజులుగా రేషన్‌బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు సమాచారం అందింది. శుక్రవారం జీవీ శ్రీనివాసులు రైస్‌మిల్లులో తనిఖీ చేశామన్నారు. అందులో అక్రమంగా నిల్వవుంచిన పదిబస్తాలు రేషన్‌బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా నిల్వ వుంచిన వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, నిల్వవుంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఉస్మాన్, ఆర్ఐ బాలాజి, వీఆర్‌ఓలు అల్లాబకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

570 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



చిన్నమండెం, జూలై12: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 570 బస్తాల రేషన్ బియ్యంతో వెళ్తున్న ఏపీ 39టీ 8606 లారీని పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. అనుమానంతో ఆపి చెక్ చేయగా బియ్యం బస్తాలుగా గుర్తించారు. వాటిని శాంపిల్స్ పంపించగా అవి రేషన్ బియ్యం అని తేలడంతో ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఖాజీపేట, జూలై 12: డయేరియాతో బాధపడుతున్నవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిడుతూరు గ్రామస్థులను పలకరించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా కలుషిత నీరు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, అంతేకాక ప్రతి ట్యాంకును శుభ్రపరచి మంచినీటిని అందించాలన్నారు. టీడీపీ నేతలు శ్రీరాములుయాదవ్ పాల్గొన్నారు.

నిప్పంటించుకుని కారులో వ్యక్తి మృతి

పులివెందుల టౌన్, జూలై 12: మద్యం మత్తులో నిప్పంటించుకుని కారులో వ్యక్తి మృతి చెందాడు. బొగ్గుడుపల్లెలో శుక్రవారం చోటుచేసుకున్న ఘటనలో కెళితే... బొగ్గుడుపల్లె వాసి ప్రభాకర్‌రెడ్డి (70)కి కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేదు. శుక్రవారం తన కల్లంలో ఉన్నకార్లోకి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకుని మృతిచెందినట్లు సమాచారం. ఈ సంఘటనపై సీఐని వివరణ అడగ్గా మా దృష్టికి రాలేదన్నారు.

అందుబాటులో ఇంటర్ సర్టిఫికెట్స్

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: జిల్లాలో అన్ని జూనియర్ కళాశాల్లో 2024కు సంబంధించి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్స్ అందుబాటులో ఉన్నాయని ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. విద్యార్థులు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి సర్టిఫికెట్లు పొందాలని కోరారు.

ఇది ప్రజా విజయం

- సీఎంరమేశ్ విజయోత్సవ ర్యాలీ విజయవంతం
- పొట్లదుర్తిలో పెల్లుబుకిన అభిమానం
- పెద్దఎత్తున మహిళలు, ప్రజలు, అభిమానులు స్వాగతం
- తల్లి దీవించగా.. దిష్టితీసి ఆహ్వానించిన చెల్లెళ్లు
- మరువలేని అభిమానం : సీఎం రమేశ్





తల్లిని ఆలింగనం చేసుకుని దీవెనలందుకుంటున్న సీఎంరమేశ్ - సీఎం.రమేశ్‌కు దిష్టితీస్తున్న సోదరీమణులు, తమ్ముని కూతురు

ఎర్రగుంట్ల, జూలై 12: అనకాపల్లి ఎంపీగా విజయం సాధించి జిల్లాకు వచ్చిన సీఎం రమేశ్‌కు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దీంతో ఎంతో పులకించిన ఆయన ఇది ప్రజా విజయమని మరువలేని అభిమానమని, గర్వంగా ఉందన్నారు. స్వగ్రామం పొట్లదుర్తిలో సీఎం రమేశ్‌కు తల్లి రత్నమ్మ ఆశీర్వాదం అందించడం సోదరీమణులు దిష్టితీసి ఇంట్లోకి ఆహ్వానించారు. ప్రజలు ఆయనకు జేజేలు కొట్టారు. వివరాల్లోకెళితే....

శుక్రవారం ఉదయం సీఎంరమేశ్ కడప ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. వందలాది వాహనాలు వెంట రాగా పొట్లదుర్తి నాలుగురోడ్ల కూడలి వద్ద ఆయన ఓపెన్ టాప్ వాహనంలో విజయ దరహాసంతో రెండుచేతులతో అందరికీ నమస్కారం చేయడంతో అభిమానులు రెట్టించిన ఉత్సాహంతో ఆయనకు ఘనస్వాగతం పలకగా, భారీ క్రేన్‌తో గజమాల వేశారు. పూలుచల్లుతూ అభిమానులు కార్యకర్తలు స్వాగతం పలికారు. తన అవ్వతాతలు సీఎం.సుబ్బానాయుడు, సుబ్బమ్మ కాంస్య విగ్రహాలకు కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నమస్కరించారు. ఇంటి ముందు చెల్లెళ్లు మాధవి, విజయ దిష్టితీసి హారతివ్వగా, తల్లి రత్నమ్మ దీవెనలు తీసుకుని ఆయన ఇంట్లోకి వెళ్లారు. పొట్లదుర్తి జనసంద్రంగా మారింది. ఎటుచూసినా వాహనాలు, ప్రజలే కనిపించారు. తెలుగు యువత రాష్ట్ర నేత సారథినాయుడు ఆధ్వర్యంలో సుమారు 25వాహనాలతో పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ ఎర్రగుంట్ల మండల కన్వీనర్ మేకల మోహన్‌రెడ్డి, చెమికల రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలతో వెళ్లి బొకేలిచ్చి స్వాగతం పలికారు.

ఇది ప్రజల విజయోత్సవం

ఇది ప్రజల విజయోత్సవ ర్యాలీగా అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ పేర్కొన్నారు. ప్రజల అభిమానాన్ని ఎన్నటికీ మరవలేనన్నారు. వేలాది మంది బ్రహ్మరథం పట్టారన్నారు. విజయోత్సవ భారీర్యాలీ విజవంతమైందన్నారు. ఇందుకు కృషి చేసిన నేతలు, అభిమానులు, ప్రజలకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, రైల్వేకోడూరు టీడీపీనేత విశ్వనాథ నాయుడు, సీఎం సురేష్ నాయుడు సోదరులు సీఎం.రాజేష్, సారథినాయుడు, సుధీర్ నాయుడు, బిస్మిల్లాబాదు వాసుదేవరెడ్డి, నాగరాజు నాయుడు, ఎంపీటీసీ శివప్రతాప్‌రెడ్డి, జయప్రకాష్ నాయుడు, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

భారీగా సన్మానం..

అనకాపల్లి ఎంపిగా గెలుపొంది పొట్లదుర్తికి వచ్చిన సీఎంరమేశ్‌కు ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు వరద రాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి సీఎంరమేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నేతలు సింగారెడ్డి రామచంద్రారెడ్డి సీఎం రమేశ్‌కు శాలువా కప్పి సన్మానించారు. టీడీపీ నేతలు హరిప్రసాద్, ముక్తియార్, నాగులపల్లి చంద్ర ఓబుళరెడ్డి రమేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా రైల్వేకోడూరు, రాజంపేట, శ్రీకాళహస్తి, అనంతపురం జిల్లాల నేతలు ఆయన్ను కలిసి శాలువాలు కప్పి, బొకేలిచ్చి పెద్దఎత్తున సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పెద్దఎత్తున సీఎంరమేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా నేతలు రమేశ్‌కు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.



భారీగా వచ్చిన అభిమానులకు భోజన ఏర్పాట్లు

భారీ పోలీసు బందోబస్తు

విజయోత్సవ ర్యాలీ సందర్భంగా సుమారు 130 మంది పోలీసు సిబ్బందితో దారిపొడవునా భద్రతను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. సీఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పనిచేశారు.

వేలమందికి భోజనాలు

సీఎంరమేశ్ విజయోత్సవ ర్యాలీ పురస్కరించుకుని పొట్లదుర్తిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో సుమారు 8వేల మందికి మాంసాహార భోజనాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది కార్యకర్తలతో కూలైన్లు ఏర్పాటు చేసి 12కౌంటర్లలో అందరికీ భోజనాలను వడ్డించారు.

హెల్మెట్ ఉపయోగంపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న ట్రైనీ న్యాయమూర్తులు చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి

కడప(రూరల్) జూలై 12: హెల్మెట్ ఉపయోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని తద్వారా ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని ట్రైనీ న్యాయమూర్తులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, కె. సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రిమ్స్ పోలీస్‌స్టేషన్ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వాడకం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. రోడ్డు భద్రత నియమావళిని పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడంపై తగు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సెక్షన్ 124 మోటార్ వెహికల్ అక్సిడెంట్ చట్టం, సెక్షన్ 304, 183, 184, రూల్ 176 ప్రకారం రోడ్డు భద్రతకు సంబందదించి ఎలక్ట్రానిక్ పరికరాలపైన స్పీడ్ కెమెరా, క్లోజ్ సర్క్యూట్ టెలివిజన్ కెమెరా, స్పీడ్ గన్ తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతకు వాడుతోందన్నారు. అనంతరం వారు కడప కేంద్రకారాగాన్ని విజిట్‌చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. రిమ్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్ర, ఎస్ఐ నారాయణ, ఏఎస్ఐ యోగ, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

తప్పిన ఘోర ప్రమాదం

అదుపు తప్పి శివాలయం ప్రహరీని ఢీకొన్న కారు



శివాలయం గోడను ఢీకొన్న కారు

రైల్వేకోడూరు, జూలై 12: ప్రధానదారిలో శుక్రవారం ఓ కారు అదుపు తప్పి శివాలయం ప్రహరీని ఢీకొంది. రైల్వే స్టేషన్ సమీపం నుంచి కడప వైపు వెళుతున్న కారు శ్రీక్రిష్ణదేవరాయులు విగ్రహం వద్ద అదుపు తప్పింది. ఏకంగా తోపుడు బండ్ల వైపు దూసుకుపోయి శివాలయం ప్రహరీని ఢీకొంది. దీంతో గోడ కొంత కూలిపోయింది. కారు వేగంగా రావడంతో శివాలయం వద్ద ఉన్న తోపుడు బండ్లు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో తోపుడు బండ్లు, పార్క్ చేసిన వాహనాలు దెబ్బతిన్నాయి. పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగే సమయంలో తక్కువ మంది జనాభా ఉండడంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారిస్తున్నా రు. కారు డిక్కీ తెరిచి మళ్లీ డిక్కీ వేసి కారు తాళాలు పెట్టి స్టార్ట్ చేయగా వేగంగా కారు కదిలిందని డ్రైవర్ బుకాయించాడని స్థానికులు తెలిపారు.

నవభారత నిర్మాణంలో యువతే కీలకం



ప్రశంసాపత్రం అందిస్తున్న మణికంఠ

కడప (మారుతీనగర్), జూలై 12: నవభారత నిర్మాణానికి యువతే కీలకమని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ అన్నారు. ఆపదలో ఉన్న వారికి దాతల సాయంతో రక్తం అందిస్తున్న జె.బి.వి.ఎస్ సంస్థ శ్రమిస్తున్న తీరును అభినందిస్తూ సొసైటీలో ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు అశోక్, బ్లడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు శివశంకర్‌రెడ్డి, రిమ్స్ బ్లడ్‌బ్యాంకు వైద్యులు రాజేంద్రప్రసాద్, వలంటీర్లు, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను చంపి పూడ్చిన భర్త

అనుమానమే కారణమా?

పోలీసు స్టేషనులో లొంగిపోయిన వైనం

శవాన్ని పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలించిన పోలీసులు



రేష్మ ఫైల్ ఫొటో

ప్రొద్దుటూరు, జూలై 12: భార్య రేష్మకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో కట్టుకున్న భర్తే కడతేర్చాడు. అంతటితో ఆగక శవాన్ని పూడ్చివేసి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. విషాద సంఘటనవివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం అమృతనగర్ వాసి అన్వర్ బాషకు మైలవరం మండలం దొడియంకు చెందిన రేష్మను వివాహం చేసుకున్నాడు. కుటుంబ పోషణ నిమిత్తం అన్వర్ బాషా ప్రొక్లయినర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కాగా తన భార్య రేష్మకు మరొకరితో వివాహేతర సంబంధం వుందనే అనుమానం కలిగింది. దాన్ని జీర్ణించుకోలేక ఆమెతో నమ్మబలికి ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్ గాంధీ ఏకోపార్కు ఎదురుగా వున్న రిజర్వుఫారెస్టులోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె మెడకు చున్నీ బిగించి గొంతునులిమి చంపాడు. ఏకంగా రిజర్వుఫారెస్టులోని భూమిలో పూడ్చివేశాడు. ఆ తరువాత ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషనుకు వెళ్లి లొంగిపోయి తన భార్యను అనుమానంతో చంపినట్లు వారికి తెలిపాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఎర్రగుంట్ల రోడ్డులోని రిజర్వుఫారెస్టు భూమిలో రేష్మను చంపి పూడ్చిన ప్రదేశాన్ని పోలీసులు కనుగొన్నారు. శవాన్ని బయటికి తీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ సీఐ రమణారెడ్డి వెల్లడిస్తున్నారు. ఈ హత్యపై ఇంకా పూర్తి స్థాయిలో విచారణ జరిపి పూర్వపరాలు వెల్లడిస్తామని వారు మీడియాకు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు రూరల్ పోలీసుల అదుపులోనే వున్నాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు కూడా వున్నట్లు సమాచారం.



శవాన్ని పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బోరుపైపుల చోరీ విఫలయత్నం

కొండాపురం, జూలై 12: ప్రసిద్ధ క్షేత్రమైన దొంతికోన వేంకటేశ్వర స్వామి కోనలో బోరుపైపుల చోరీకి విఫలయత్నం జరిగింది. కోనలో ఉన్న 35 బోరు పైపులను గురువారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడానికి యత్నించినట్లు ఆలయ కమిటీ మెంబర్ ప్రతాప్ యాదవ్ తెలిపారు. అయితే పైపులు తీసే సమయంలో తమ మనషులు వెళ్లే సరికి వారు పారిపోయినట్లు ఆయన తెలిపారు.

తాడిపత్రి కేసులో 60 మంది బెయిలుపై విడుదల

కడప (క్రైం), జూలై 12: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాడిపత్రిలో జరిగిన ఘర్షణ సంబంధించి కడప సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీలుగా ఉన్న 60 మందిని బెయిలుపై విడుదలయ్యారు. శుక్రవారం ఈ మేరకు విడుదల కానున్న వారి బంధువులు కడప సెంట్రల్ జైలు వద్దకు వచ్చి విడుదలైన వారిని సొంత గ్రామాలకు తీసుకెళ్లారు.

సెకండియర్ డిప్లమాలో స్పాట్ అడ్మిషన్స్

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల్లో ఇంటర్ వృత్తి విద్య కోర్సు ద్వారా డిప్లమా సెకండియర్ చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ కోసం 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. 18తేదీన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌కు ప్రభుత్వ కళాశాలల్లో అయితే రూ.4700, ప్రైవేటులో రూ.25వేలు చెల్లించాలన్నారు.

డ్రైడే పాటించండి.. దోమలను పారదోలండి


అచ్చువెల్లిలో డ్రైడే గురించి వివరిస్తున్న సిద్దయ్య

పులివెందుల రూరల్, జూలై 12: ప్రాణాంతక వ్యాధులు ప్రబలేందుకు కారణమయ్యే దోమలను ని వారించేందుకు ప్రతి ఇంట్లో డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని అచ్చువెల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. కదలిక లేని నీటినిల్వలపై దోమలు గుడ్లు పెట్టి 8 నుంచి 10 రోజులలోపు దోమగా రూపాంతరం చెందుతుందని, కావున వారానికి ఒక రోజు ఇంట్లో డ్రైడే పాటించాలని, డ్రైడే చేపట్టే విధానాన్ని వివరించారు. సీహెచ్ఓ శివసౌజన్య, ఆరోగ్య కార్యకర్త సరస్వతి, సచివాలయం సెక్రటరీ ప్రసన్న, ఆశా కార్యకర్త భారతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాన్ని కూల్చినందుకు నోటీసులు

కడప, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ భవనాన్ని కూల్చినందుకు నోటీసులు జారీ చేశామని పంచాయతీ కార్యదర్శి గంగులయ్య శుక్రవారం పేర్కొన్నారు. మండల కేంద్రమైన చక్రాయపేటలో సర్వే నెంబర్ 372బీలో 20సెంట్ల స్థలంలో ప్రభుత్వ వైద్యశాల నిర్మించారన్నారు. ఆ భవనాన్ని కొందరు ఆక్రమించుకుని భవనాన్ని పగలగొట్టారు. ప్రభుత్వ భవనాన్ని ఎటువంటి అనుమతి లేకుండా కూల్చివేసినందుకు ఏపీటీఆర్ యాక్ట్- 1994 సెక్షన్ 58, జీఓఎంఎస్ నెంబర్ 188, 21.07.2011 ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ఆ నోటీసులో పేర్కొన్నారు. తక్షణం స్థలాన్ని ఖాళీ చేయాలని కోరామని, దీనిపై అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఐఆర్‌పీలు

కడప (ఎడ్యుకేషన్), జూలై 12 : కడప నగరం ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే మాధవీరెడ్డిని ఐఆర్ పీలు కలిసి వారి సమస్యలను తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు గంగులప్ప, విజయమ్మ, అనురాధ, సుజాత, వసుధ, మాధవీ కరుణాకర్ పాల్గొన్నారు.

కొప్పర్తిని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే


కొప్పర్తి పారిశ్రామిక వాడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి తదితరులు

సీకేదిన్నె, జూలై 12: కొప్పర్తిని పారిశ్రామికంగా అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి పారిశ్రామిక వాడలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తిలో పారిశ్రామిక పరుగులు పెట్టిస్తామని అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుని ముందుకు సాగుతామన్నారు. చిన్న చిన్న పరిశ్రమలు సైతం స్థాపించి ఉపాధి అవకాశాలు పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. పారిశ్రామికంగా కొప్పర్తిని అభివృద్ధి చేస్తే జిల్లాలో అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి జరుగుతుందని, అదే విధంగా పరోక్షంగా అనేక కుటుంబాలు లబ్ధిపొందే అవకాశాలు ఉంటాయని పరిశ్రమలు పెట్టేందుకు మరికొంతమంది ముందుకొస్తున్నారని, వారందరికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసి త్వరగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా కొప్పర్తిలోని డిక్షన్ కంపెనీ అధికారులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కంపెనీ ప్లాంట్ మొత్తం పరిశీలించి అక్కడ తయారయ్యే సీసీ కెమెరాలను ఏ విధంగా తయారు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐటీ మినిస్టర్ నారా లోకేష్ సహకారంతో కొప్పర్తిని ఇండ్రస్ట్రియల్ ల్యాబ్‌గా మార్చుతామన్నారు. ఈ సందర్భంగా చిన్నపరిశ్రమలవారు రాత్రిపూట పోలీస్ పికెటింగ్ కావాలని కోరగా జిల్లా ఎస్పీతో మాట్లాడి అప్పటికప్పుడే పికెటింగ్ ఉండేలా గస్తీ ఏర్పాటు చేయించడంతో పరిశ్రమలవారు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పరిశ్రమల సముదాయంలో సమీపంలో ఒక ఆస్పత్రి, ఫైర్‌స్టేషన్ వచ్చేవిధంగా కృషి చేస్తామని, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సందర్భంగా కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ యువనాయకులు పుత్తా లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

● ఎంపీ సీఎం రమేశ్‌కు ఘన స్వాగతం

అనకాపల్లి ఎంపీగా గెలిచి మొదటిసారి జిల్లాకు వచ్చిన సీఎం రమేశ్‌కు ఎన్డీఏ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. వందలాది కార్లు, ద్విచక్రవాహనాలు ర్యాలీగా వచ్చాయి.





అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: సీఐ


మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూలై 12: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ మోహన్‌కుమార్ హెచ్చరించారు. శుక్ర వారం పులివెందుల పట్టణంలోని మట్కా బీటర్లకు డీఎస్పీ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాలలో మట్కా స్థావరాలపై దాడులు నిర్వహించగా క్రిస్టియన్ కాలనీలో ఓవ్యక్తి పట్టుకొని మట్కా స్లిప్పులు రూ.1500 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వాతావరణ సంక్షోభం తగ్గించడంలో చెట్లు కీలకం


మాట్లాడుతున్న డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 12 :ప్రపంచ వాతావరణ సంక్షోభాన్ని తగ్గించడంలో చెట్లు కీలకమని కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటరులో మాస్టరు ట్రైనర్లకు ఐదురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభించిన ఆయన చెట్లు మన జీవితాల్లో కలిగించే ప్రాధాన్యత, ఆగ్రో ఫారెస్టింగ్ పద్ధతుల ద్వారా రైతులకు కలుగు ప్రయోజనాలు వివరించారు. అలాగే పరిశ్రమలో కలప ప్రాముఖ్యతను కలప సరఫరా డిమాండ్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టోఫీ బృందం స్టేట్ కోఆర్డినేటరు ఎ.అజిత్, స్టేట్ అసోసియేట్ కె.సతీష్, కేవీ జయంత్, జి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పేపరు సంచుల దినోత్సవం


పేపరు బ్యాగులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 12 :కడప నగరంఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఎన్‌సీసీల ఆధ్వర్యంలో ప్రపంచ పేపరు బ్యాగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ నివారణపై ప్రిన్సిపాల్ సలీంబాషా మాట్లాడారు. అలాగే కాగిత సంచులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా జూట్ బ్యాగులు తయారు చేసే సంస్థ వ్యవస్థాపకురాలైన భవానీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గుర్విరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మీదేవి, శచీదేవి, ఎన్‌సీసీ అధికారిణి స్వరూప పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ బదిలీ సర్వసాధారణం


గీతాధర్‌ను సన్మానిస్తున్న బ్యాంకు మేనేజర్ తదితరులు

వీరపునాయునిపల్లె, జూలై 12: ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, సీమల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఏపీజీ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న గీతాధర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందన సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖాతాదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందారన్నారు. నిష్పక్షపాతంగా విధులను నిర్వహించారన్నారు. అనంతరం గీతాధర్‌ను శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్యామ్‌ప్రసాద్, క్యాషియర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: జిల్లాలో డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల హాస్టళ్ల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జూలై 20 నుంచి 30 వరకు హాస్టల్‌లో విద్యార్థుల వద్ద నుంచి సమస్యలు సేకరించి వాటి పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్‌లు మూతపడ్డాయని, మూతబడిన హాస్టల్‌ను వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. చాలా హాస్టళ్లలో మరమ్మత్తులు చేయాలని పూర్తిగా పాడిబడిన హాస్టళ్లను నూతన భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయులు శివశంకర్, అభిరానంద్, చంద్ర, మస్తాన్, అశోక్, రాజేష్, షాహిద్ సల్మాన్ తదితరులు పాల్గొన్నసరు.

మొహర్రం వేడుకలు ప్రారంభం


వెల్లటూరు గ్రామ చావిడిలో కొలువైన పీర్లు

పెండ్లిమర్రి, జూలై 12: మండలంలోని వెల్లటూరు గ్రామంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం వెల్లటూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచు పెద్దమల్లారెడ్డి, నాగమల్లారెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో చిన్న సరిగెత్తు కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం గుండం కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు రోజంతా ఉపవాసం ఉండి నిప్పుల గుండంలో దిగుతారన్నారు. బుధవారం వేషాలు, విచిత్ర వేషధారణలతో ఘనంగా మొహర్రం కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలన నిర్వాహకులు కోరారు.

హామీ నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబు

● కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి


నిత్యావసర వస్తువులను అందిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప(రూరల్) జూలై 12 :ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట తప్పని నేత అని, ఆయన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే నిత్యావసర ధరలను అదుపు చేయడంతో పాటు బియ్యం, కందిబేడలను తక్కువ ధరకు అందిస్తారని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప రైతు బజారులో సబ్సిడీ ధరలతో నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు అధికంగా ఉండేవన్నారు.గత ప్రభుత్వం సంక్షేమం పేరుతో రూపాయి ఇచ్చి పదిరూపాయాలు రాబట్టే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. నాటి పరిస్థితులను గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల ధరలను అదుపులో ఉంచుతామని చెప్పారన్నారు. ఈమేరకు కడప రైతుబజారుతో పాటు మండీ బజారు, ఇతర షాపింగ్ మార్ట్‌లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి తక్కువ ధరకు నిత్యావసరాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ రాబోయే కాలంలో అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలు పెం చేలా చర్యలు తీసుకుంటారన్నారు. రైతుబజారులో నెలకొన్న సమస్యలతో పా టు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, నేతలు జిలానీ బాషా, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


కొలుములపల్లెలో నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న అధికారులు

సీకేదిన్నె, జూలై 12: పరిశుభ్రతే ఆరోగ్య భద్రత అని చింతకొమ్మదిన్నె వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. ఇటీవల కాలంలో డయేరియా అధికంగా ప్రబలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కొలుములపల్లె పంచాయతీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపటి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే వ్యాధులు రాకుండా చూడవచ్చని అందుకు ప్రజలు అధికారులకు సహకరించి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అనంతరం తిరిగి నీటిని నింపుకోవచ్చన్నారు. పూలకుండీలు, పాత కుండలు, పాత టైర్లు ఉండే నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, అటువంటి వాటిని నిరంతరం శుభ్రం చేయాలన్నారు. ఈ కాలంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఉంటాయని, దోమలు మురికి పదార్థాలపై వాలి ఆహార పదార్థాలపై వాలడం వలన వాటి పాదాలకు అంటుకున్న క్రిములు మానవ శరీరంలోకి వెళ్లి వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు. ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షకీలాబేగం, ఈవోఆర్‌డీ శ్రీధర్, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, రమాదేవి, పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉపాధ్యాయులు బాలగంగిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయిల్ ఆధ్వర్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

కడప (మారుతీనగర్), జూలై 12 : కడపలో సెయిల్ ఏర్పాటు చేయదలపెట్టిన ఉక్కు పరిశ్రమను సెయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని గ్రేటర్ రాయపీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమను కేంద్రం విస్మరిస్తే విద్యాలయాలను ఉద్యమ నిలయాలుగా మారుస్తామని హెచ్చరించారు. రాయలసీమ ప్రాంతంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ సీమ ప్రాంత అభివృద్ధి కోసం రాష్ట్ర విభజన నేపధ్యంలో జిల్లాలో ప్రభుత్వరంగ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని దేశ ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చి పది సంవత్సరాలు అవుతుదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అలసత్వం వీడి ఉక్కు పరిశ్రమ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు బాబు, గ్రేటర్‌రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య నాయకులు షాజహాన్, సర్దార్, ఫైరోజ్, రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పట్టుబడిన ఎర్రచందనంతో ఫారెస్టు అధికారులు

కడప (క్రైం), జూలై 12 :సీకేదిన్నె మండలం మద్దివడుగు అడవి సమీపంలో ఎర్రచందనం దుంగలు డంపింగ్ చేస్తుండగా తమను చూసి స్మగ్లర్లుపారిపోవడంతో అక్కడ 28 దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు కడప ఫారెస్టు రేంజ్ అధికారి ప్రసాద్ తెలిపారు. జిల్లా ఫారెస్టు అధికారి ప్రదీప్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజామెన కొంత మంది ఎర్రచందనం దుంగలు మోసుకొస్తుండగా తమ సిబ్బంది చూసి దుంగలు అక్కడే పడేసి పరారీ అయ్యారు. 28 దుంగలు స్వాధీనం చేసుకున్నామని వాటి బరువు 723 కేజీలు ఉంటుందని ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి: ఎస్టీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), జూలై 12 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎస్టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో కనీస వసతుల నిర్వహణకు అవసరమయ్యే గ్రాంటును ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారిన జీఓ 170ని రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీడీవో షకీలాబేగం

సీకేదిన్నె, జూలై 12: మండల ప్రజల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఎంపీడీఓ షకీలాబేగం తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మండలం అ న్ని విధాలా అభివృద్ధి చేస్తామని అందుకు అందరి సహకారం తీసుకుని ముం దుకెళుతామన్నారు. ఈ సందర్భంగా అధికారులు వారి వారి శాఖల లక్ష్యాలను, ప్రగతిని వివరించారు.తహసీల్దారు భాగ్యలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బేడ బుడగజంగం వాసులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి


మాట్లాడుతున్న బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 12 : బేడ బుడ్గజంగం వారికి ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని బేడ, బుడ్గజంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి డిమాండ్ చేశారు. శుక్రవారం బేడ బుడ్గ జంగం జిల్లా కార్యాయలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరల నుండి బుడ్గ జంగం వారికి ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని పోరాటాలు చేశామన్నారు. 2018న చంద్రబాబు ఇంటి వద్దనే చంద్రబాబును కలిసి తమ సమస్యలను వివరించామన్నారు. అలాగే బేడ బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మహాసభ జరిగిందని ఆ సభలో చంద్రబాబు మాట ఇచ్చిన విషయం గుర్తు చేశారు. బేడ బుడ్గజంగం వారికి ఎస్సీ సర్టిఫికెట్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.రాములు, ఆంజనేయులు, వెంకటయ్య, కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ అక్రమాలపై దృష్టిసారించాలి

● ఎమ్మెల్యే మాధవీరెడ్డికి టీఎన్ఎస్ఎఫ్ నేతల వినతి

కడప (ఎడ్యుకేషన్), జూలై 12 : వైవీయూ మాజీ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వైవీ వెంకటసుబ్బయ్య చేసిన అవినీతి అక్రమాలపై సీబీడీ విచారణ జరిపించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, వైవీయూ టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థులు, స్కాలర్స్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడపనగరం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అలాగే వైవీయూలో సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సౌకర్యాల లేమి, వసతిగృహాల సమస్యలు, ఫీజుల పెరుగుదల అధ్యాపకుల కొరత, పాఠ్యాంశాల మౌళిక సదుపాయాల గురించి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్, అమృత్, గిరి, రవి, అశోక్, అనీస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

'ఫైనాన్స్ సంస్థల అరాచకాలు అరికట్టాలి'

కడప (మారుతీనగర్), జూలై 12: ప్రజలను దోపిడీ చేస్తున్న ఫైనాన్స్ సంస్థల అరాచకాలను అరికట్టాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక వడ్డీల పేరుతో పలు దురాగతాలకు పాల్పడుతున్నారని, కావున బాధితులకు అండగా పోరాడుతామని పేర్కొన్నారు. గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక, రైతు స్వరాజ్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కావున ఈ దోపిడీ అరికట్టాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో ప్రవచనాలు


హాజరైన ఆర్యవైశ్య మహిళలు(ఇన్‌సెట్) వాసవీ మాత ప్రవచనాలు వినిపిస్తున్న సత్రసాల సాయిరాం

వేంపల్లె, జూలై 12 :వేంపల్లెలోని వాసవి కన్యకాపరమేశ్వరిని దేవస్థానంలో శుక్రవారం కదిరికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు సత్రసాల సాయిరాం ప్రభాకర్ వాసవి జన్మవృత్తాంతము-ప్రవచనాలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. అమ్మవారికి కుంకుమార్చన, తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి, ఆర్యవైశ్య ప్రతినిధులు హరికృష్ణ, బాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

29న దళితుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రొద్దుటూరు టౌన్, జూలై 12: దళితుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 29వ తేదీ కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 29వ తేదీ ఉదయం కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వద్ద వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేస్తామని తెలిపారు. అనంతరం ర్యాలీ, ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సంగటి పుల్లయ్య, రాష్ట్ర సమన్వయకర్త మేకల యేసురత్నం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

మైలవరం, జూలై 12 : మండలంలో రెండో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ చిదంబరరెడ్డి శుక్రవారం తెలిపారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

● **మండలంలో విద్యుత్‌శాఖ దాడులు..:** మండల పరిధిలోని కల్లుట్ల పంచాయతీలో విద్యుత్ చౌర్యం నిరోధక శాఖ ఏడీఏ మధులత ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. గృహాలకు అక్రమంగా విద్యుత్, మీటర్లు లేని ఇళ్లపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏడీ రాజగోపాల్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన రామేశ్వరం ఎస్‌పీసీఎన్ విద్యార్థులు



ప్రొద్దుటూరు ,జూలై 12 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ రామేశ్వరంలోని ఎస్‌పీసీఎన్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు పది మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గురుసుష్మ, బిందు, మనోజ్‌కుమార్, నాగగణేష్ నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. కీర్తన, సిరి, భార్గవి, గోవింది, గురు ఇడుపులపాయ క్యాంపస్‌కు ఎంపికయ్యారు. ఒంగోలు క్యాంపస్‌కు భువన, చంద్రిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

మున్సిపల్ రెవెన్యూ అధికారిగా కె శ్రీనివాసరావు

ప్రొద్దుటూరు, జూలై 12 : ప్రొద్దుటూరు మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్‌గా నంద్యాల మున్సిపాలిటీలో మేనేజర్‌గా వున్న కె శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. ఆమేరకు శుక్రవారం కమిషనర్ రఘునాథరెడ్డిని కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చి విధుల్లో చేరారు.

దీర్ఘకాలిక పండ్లతోటలకు ఆర్థిక సాయం

అట్లూరు, జూలై 12 : మండలంలోని దీర్ఘకాలిక పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు జాతీయ కోర్ కార్బన్ ఎక్సొలేషన్ కంపెనీ వారు చీనీ, నిమ్మ జామ, మామిడి, నేరేడు తదితర పండ్ల తోటలకు ఎకరాకు 3వేల నుంచి 5వేల వరకు ఆర్థిక ప్రోత్సాహం ఇస్తున్నట్లు కంపెనీ నిర్వహకులు మురళీక్రిష్ణ, రామక్రిష్ణ తెలిపారు. పండ్ల తోటల సాగు వల్ల కాలుష్య నియంత్రణ అరికట్టవచ్చని తెలిపారు. 8 నెలల క్రితం కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ కంపెనీ తరపున సంఘ మిత్ర అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య తన బృందంతో అట్లూరు, గోపవరం, బద్వేలు మండలాల్లో రైతులు సాగు చేసిన దీర్ఘకాలిక పండ్లతోటలను 3500 ఎకరాలు గుర్తించి కంపెనీకి నివేదికలు పంపారు. నివేదిక పరిశీలించిన కంపెనీ బృందం వారు మండలంలో పర్యటించి పండ్ల తోటలు సాగు చేసిన రైతులతో సాగు వివరాల గురించి మాట్లాడారు. అనంతరం మొక్కలకు నెంబర్లవారీగా ట్యాగులు కట్టి పండ్లతోటలు గుర్తించారు. సంఘ మిత్ర బృందం ప్రసాద్, మునెయ్య, రైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో వసతి గృహాలను ఏర్పాటు చేయాలి

బద్వేలుటౌన్, జులై 12 : రాష్ట్రంలో ఉన్న అన్ని మోడల్‌స్కూల్స్‌లో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు విడివిడిగా వసతిగృహాలను ఏర్పాటు చేయాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డెమోక్రటిక్‌పీఆర్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మాట్లాడారు. విద్యావస్థను నిర్వీర్యం చేస్తున్న జీవో నెంబర్ 117ను వెంటనే రద్దుచేయాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ శుద్ధ సప్తమి పూజలు



జమ్మలమడుగు, జూలై 12: మండలంలోని కన్యతీర్థంలో శుక్రవారం శుద్ధ సప్తమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. అభిషేకం, యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మాట్లాడుతూ కన్యతీర్థం శైవక్షేత్రంలో బాలత్రిపురసుందరీదేవి, సుందరేశ్వరస్వామి అమ్మవారికి ఆషాఢ శుక్రవారం శుద్ధ సప్తమి వంటి ప్రత్యేక రోజుల్లో భక్తులు పూజలు నిర్వహిస్తే ఆయురారోగ్యాలు లభిస్తాయని, గ్రహ సమస్యలు తొలగిపోయి అష్టైశ్వర్యాలు లభిస్తాయని తెలిపారు. అమ్మవారి ఎదురుగా మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేసి మొక్కుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ

ముద్దనూరు జూలై12: మండల పరిధి చింతకుంట గ్రామ పొలాల్లోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి దొంగలు పగుల గొట్టి కాపర్ వైర్ చోరీ చేశారు. చింతకుంట గ్రామానికి చెందిన చిలకల పెద్దిరాజు అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ వైరు తొలగించి అందులోని కాపర్ వైర్ చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు.

శాకాంబరిదేవిగా రామలింగ చౌడేశ్వరీదేవి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 12: మేదరవీధిలోని రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆషాఢమాస తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. పూజలు అనంతరం ఆకుకూరలు, కూరగాయలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్టి నాగశయనం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేశ్‌కు నేతల ఘనస్వాగతం

ప్రొద్దుటూరు, జూలై 12 : అనకాపల్లి బీజేపీ ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొంది సొంత జిల్లాపర్యటనకు మొదటి సారి విచ్చేసిన సీఎం రమేశ్‌కు ప్రొద్దుటూరులో కూటమి నేతల ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఆయన కడపలో పర్యటన ముగించుకుని ప్రొద్దుటూరుకు వచ్చారు. ప్రొద్దుటూరు కొత్తపల్లి సర్కిల్ దగ్గర సర్పంచ్ శివచంద్రారెడ్డి కౌన్సిలర్‌వంగనూరు మురళీధర్‌రెడ్డి గజమాలతో స్వాగతం పలికారు. అక్కడినుంచి భారీగా కార్లు, బైకులతో యువత పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. మైదుకూరు రోడ్డు సీఎంఆర్‌షాపింగ్ మాల్ భవన యజమాని బుశెట్టి రాజశేఖర్ భారీ గజమాలతో స్వాగతం పలికారు. శివాలయం సర్కిల్లో బీజేపీపట్టణ నేతలు ఎంపీ రమేశ్‌ను సన్మానించారు. గాంధీరోడ్డులోని నెహ్రూ రోడ్డులో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి టీడీపీ నేతలతో కలిసి సీఎం రమేశ్‌కు స్వాగతం పలికి సీఎం రమేశ్ వెంట వాహనర్యాలీలో పాల్గొన్నారు.ప్రసాద్ రెడ్డి ఆసుపత్రి వద్ద టీడీపీ యువతరాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల నాగరాజు, దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి యూత్‌తో కలిసి స్వాగతం పలికారు. గజమాల వేసి సత్కరించారు. జనసేన కార్యకర్తలు పవన్ అభిమానులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ గాంధీరోడ్డుమీదుగా ఒన్‌టౌన్‌సర్కిల్ గవిని సర్కిల్ గుండా ఎర్రగుంట్ల రోడ్డుమార్గాన పొట్లదుర్తిచేరుకుంది. ప్రొద్దుటూరులో అడుగడుగున పూల బొకేలు పూల మాలలతో సీఎం రమేశ్ స్వాగత సత్కారాలు అందుకున్నారు. ఈ ర్యాలీలో సీఎం రమేశ్ వెంట మాజీ మున్సిపల్‌చైర్మెన్ వీఎస్ ముక్తియార్, ఖలీల్ ఆయన అనుచర వర్గం నేతలు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌కు బీజేపీ నేతల స్వాగతం..: కడపలో సీఎం రమేశ్‌కు బీజేపీ ప్రొద్దుటూరు నియోజకవర్గ కన్వీనర్ గొర్రెశ్రీనివాసులు, పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, బీజేపీ మహిళా మోర్చా నేత జయలక్ష్మీ ఆయకు స్వాగతం పలికి శాలువతో సన్మానించారు.

మైదుకూరు రూరల్..: అనకాపల్లి ఎంపీగా గెలుపొంది మొట్టమొదటి సారిగా కడప జిల్లా పొట్లదుర్తికి వచ్చిన సీఎం రమేశ్‌ను శుక్రవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆయన సొంత ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు. అలాగే మైదుకూరు బీజేపీ ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు ఘనస్వాగతం తెలిపారు.పట్టణంలోని రాయల్ కూడలి వద్ద గజమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





ప్రొద్దుటూరులో ఎంపీ సీఎం రమేశ్ వెంట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ముక్తియార్, శివచంద్రారెడ్డి, బద్వేలు... ఎంపీ సీఎం రమేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్..: అనకాపల్లె పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొంది శుక్రవారం ఆయన సొంత గ్రామమైన పొట్లదుర్తికి వచ్చిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఎంపీ సీఎం రమేశ్ పొట్లదుర్తికి వచ్చిన సందర్భంగా జరిగిన విజయోత్సవర్యాలీలో సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్ల నుండి వాహనాల్లో పొట్లదుర్తికి తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కమ్మవారిపల్లెకు చెందిన చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ కల్వకూరి రమణ, రమేశ్ తదితరులువిజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేశ్‌కు ఘనస్వాగతం పలికిన నరసింహారెడ్డి

బద్వేలుటౌన్,జూలై 12 :అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడిగా అఖండమెజార్టీతో గెలుపొంది ప్రమాణస్వీకారం చేసిన తరువాత శుక్రవారం పొట్లదుర్తి గ్రామానికి వచ్చిన సందర్భంగా రెడ్డిట్రాన్స్‌పోర్టు, రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సబ్ కాంట్రాక్టర్ గాజులపల్లె నరసింహారెడ్డి, లోమాటి వెంకటసుబ్బారెడ్డి ఘనస్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.





సీఎం రమేశ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, నరసింహారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి





పోరుమామిళ్లలో ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు, బీకోడూరు... మేకవారిపల్లె గ్రామంలో పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో, వైద్యసిబ్బంది

పోరుమామిళ్ల, జూలై 12 : పరిసరాల పరిశుభ్రంగాఉంచుకుంటే అంటువ్యాధులు దరి చేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహరెడ్డి, తహసీల్దారు శిరీషా, ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో స్పెషల్ ఆఫీసరు చంద్రశేఖర్ అధ్యక్షతన జాతీయ కీటకజనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుకుల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు వైద్యసిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వఉన్నతపాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబన్న, పంచాయతీ కార్యదర్శులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని మేకవారిపల్లె, తుమ్మలపల్లె గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఎంపీడీవో భాస్కరరావు, వైద్యధికారి వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో పారిశుధ్యంపై సదస్సు నిర్వహించారు. మురికినీటి గుంటల్లో బ్లీచింగ్‌చల్లించి తాగునీటివనరులను పరిశీలించి శుభ్రం చేసి తదుపరి క్లోరినేషన్‌చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది నాగమణి, పుష్పాంజలి, జాన్‌విలియం, రామతీర్థం, నాగేశ్వర్‌రావు, కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన..: ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిట్టిగుంట, నర్సాపురం తదితర గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు శానిటేషన్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీ సెక్రటరీలు రామక్రిష్ణారెడ్డి, గురుప్రసాద్ దోమలు ప్రబలకుండా పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువల్లో వ్యర్థాలను తొలగించారు. అనంతర బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.ఈకార్యక్రమాన్ని తహసీల్దారు కృష్ణ.ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి, నర్సాపురం సర్పంచ్ ఖాజావలి పర్యవేక్షించారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు



శ్వేత అశ్వంపై గంధం తీసుకుపోతున్న దృశ్యం

కాశినాయన, జూలై 12: ఓబుళాపురం గ్రామంలో శుక్రవారం దస్తగిరి స్వామి దర్గా ఉరుసు ఘనంగా నిర్వహించారు. స్వామికి సమర్పించే గంధాన్ని గుంటూరు జిల్లా నుంచి తెప్పించి ప్రత్యేకంగా అలంకరించిన శ్వేత అశ్వంపై ఉంచి,జెండాలను ట్రాక్టర్‌పై పెట్టుకొని మేళతాళాలు,తప్పెట్లతో గ్రామంలో ఊరేగింపుగా తీసుకపోయారు. అనంతనం దస్తగిరి స్వామి దర్గాలో భక్తులు ప్రత్యేక పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక అలంకరణలో మేళతాళాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ గంధం తీసుకొచ్చిన గుర్రం భక్తులను ఆకట్టుకుంది. దర్గావద్ద యాటలు కోసి వచ్చిన భక్తులకు బంధు మిత్రులకు విందుభోజనాలు ఏర్పాటుచేశారు. ఈఉరుసులో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మొహర్రం వేడుకలను పురస్కరించుకుని పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లకు హిందూ-ముస్లింలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పోరుమామిళ్లలోని ఉన్న పీర్లచావిడిలో హుసేన్ పీర్ దర్గా వద్ద ఉన్న పీర్లచావిడిలో ముస్లిం కోటావీధిలో ఉన్న పీర్లచావిడిలో పీర్లకు పూజలు చేశారు. పీర్లచావిడి ఉన్న ప్రాంతాల్లో గుండాలను ఏర్పాటు చేశారు.

రోడ్లపై ఆవులు

●అవస్థల్లో వాహనదారులు



జమ్మలమడుగు, జూలై 12: జమ్మలమడుగులో పాత బస్టాండు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా, తహసీల్దారు కార్యాలయం ఆవరణం, సబ్‌జైలు సమీపాన, ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఆవులు, ఎద్దులు రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో అంబేడ్కర్ విగ్రహం సమీపాన, ప్రధాన రోడ్డు పక్కనే ఆవులు ఉంటున్నాయి. సంబంధిత యజమానులు వారి వారి ఆవులు, ఎద్దులను బయటికి తోలడం, పట్టించుకోకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా ఉన్నాయి. మున్సిపల్ అధికారులు సంబంధిత ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డయేరియాపై అవగాహన

కొండాపురం, జూలై 13 :డయేరియా వ్యాధిపై శుక్ర వారం స్థానిక గురుకుల పాఠశాలలో కిశోర బాలికలకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు.వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి,అంగన్‌వాడీ టీచర్లు డేరా జ్యోతి, తారాదేవి తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి

జమ్మలమడుగు, జూలై 12: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో అధికారులు సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వీధిలో గంగమ్మ దేవాలయం, బురుజు ఆంజనేయస్వామి, గ్రామ దేవత, మెయిన్‌బజార్, కాపు వీధి సర్కిళ్లలో ప్రజలకు బాత్‌రూములు, లెట్రిన్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. బయటి ప్రాంతాల నుంచి పనులపై దుకాణాలకు వచ్చినవారు, మహిళలు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ దేవత రోడ్డు పక్కనే గంగమ్మ దేవాలయం వెనుకభాగాన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్థలం పాఠశాల మూతపడి ఖాళీగా ఉంది. ఆ ప్రాంతంలో ఒకవైపు సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకస్మిక తనిఖీ

జమ్మలమడుగు, జూలై 12: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జూనియర్ సివిల్‌జడ్జి ఎస్. భార్గవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సబ్‌జైలును తనిఖీ చేసి సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. రికార్డులు పరిశీలించి రిమాండ్ ఖైదీలు సంఖ్య, సౌకర్యాలపై అడిగారు. అనంతరం బీసీ వెల్ఫేర్ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు వడ్డించే ఆహారం, వసతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భూతమాపురం సుబ్బారావు, సబ్‌జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బాబుల్‌రెడ్డి



ప్రొద్దుటూరు ,జూలై 12 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ప్రొద్దుటూరు టీడీపీ మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి కలిశారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పూల బోకే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రొద్దుటూరు మండల పరిధిలో టీడీపీ విజయానికి ఎంతో కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్తుకు అంతరాయం

జమ్మలమడుగు, జూలై 12: జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జమ్మలమడుగు విద్యుత్తు శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్, అర్బన్ ఏఈ రాజబాబు తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు. ప్రజలు గమనించాలని ఆయన తెలిపారు.

ముద్దనూరు..: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కోఏఈ వర్మ తెలిపారు.విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గుర్తించి, సహకరించాలని ఆయన కోరారు.

ప్రొద్దుటూరు..: విద్యుత్ శాఖ ప్రొద్దుటూరు సబ్‌డివిజనల్ పరిధిలో సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, మెయింటనెన్స్‌కోసం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శ్రీనివాసులరెడ్డి ఓప్రకటనలో తెలిపారు. 132కేవీ ,33/11 కేవీ సబ్‌స్టేషన్లలో వచ్చే విద్యుత్ పంపిణీ నెట్‌వర్కును బలోపేతం చేయడం కోసం డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ సంబంధితలైన్లు మెయింటనెన్సు కోసం విద్యుత్ అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

ఖాజీపేట, జూలై 12: తమ వంతుగా ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్‌చంద్రరావు అన్నారు. శుక్రవారం చెముళ్లపల్లె పంచాయతీలోని బీసీ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు పుల్లమ్మ గోడగడియారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామాంజనేయులు, పిల్లల తల్లిదండ్రులు దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

రాజోలి రిజర్వాయర్‌ను తప్పకుండా నిర్మిస్తా

ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్



మాట్లాడుతున్న మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

చాపాడు, జూలై 12: కర్నూలుజిల్లాలోని రాజోలి వద్ద రిజర్వాయర్‌ను తప్పకుండా నిర్మిస్తామని మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజోలి రిజర్వాయర్‌ను నిర్మిస్తే నియోజకవర్గంలోని దువ్వూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లోని భూములకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. ఏడాదిలో రైతులు రెండు పంటలు పండించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో అధికారులు అవినీతికి పాల్పడితే సహించనన్నారు. పార్టీలకతీతంగా గ్రామాలు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. రాజోలి రిజర్వాయర్‌కోసం భూమిలిచ్చే రైతులకు వెయ్యి కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాజోలిని పూర్తిగా కర్నూలుజిల్లా నుంచి కడపజిల్లాలోకి మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడినట్లు తెలిపారు. అర్హతలేని వారి పింఛన్లు తొలగించాలని ఎంపీడీవోను ఆయన ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని శ్మశానాలకు రస్తాలు, నీటి వసతి, ప్రహరీ నిర్మాణాలు వంటి పనులు చేసేందుకు నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చియ్యపాడు, తప్పెట ఓబాయపల్లె, తదితర గ్రామాల రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు స్తంభాలు ఇవ్వాలని అధికారులను కోరారు. పంటల బీమాకు ప్రభుత్వమే డబ్బులు చెల్లించాలని చియ్యపాడు గ్రామ ఎంపీటీసీ బాలనరసింహారెడ్డి కోరారు. మండలంలోని డయేరియా రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాజేష్‌కుమార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. మడూరు, ఖాదర్‌పల్లె గ్రామాల్లో ఇళ్లస్థలాల పంపిణీలో అక్రమాలు జరిగాయని సభ్యులు ఆరోపించారు. మండల సమావేశానికి రాని అధికారులను ఇకమీదట కలెక్టర్‌కు సరెండర్ చేస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ లక్షుమయ్య, డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.